

చీనీ టన్ను రూ.15 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్టంగా రూ.15 వేలు, కనిష్టంగా రూ.5 వేలు, సరాసరిన రూ.10 వేలు పలికాయి.



రైలు పట్టాలపై మృత్యు ఘోష

రైలు పట్టాలపై మృత్యు గంట మోగుతోంది. వేర్వేరు కారణాలతో రైళ్ల కింద పడి ఆత్మహత్య చేసుకుంటున్న వారి సంఖ్య జిల్లాలో పెరుగుతోంది. 10లో



జిల్లాలో శుక్రవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా కొనసాగాయి. గాలివేగం పెరిగింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి జల్లులు పడ్డాయి.

న్యూస్‌రీల్

16 మండలాల్లో వర్షం



పుట్టపర్తి అర్బన్: జిల్లాలోని 16 మండలాల పరిధిలో వర్షం కురిసింది. గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకూ కొన్ని మండలాల్లో మోస్తరుగా, మరికొన్ని మండలాల్లో చెప్పుకోదగ్గ స్థాయిలో వర్షం కురిసింది. అత్యధికంగా చెన్నేకొత్తపల్లి మండలంలో 36.8 మి.మీ వర్షపాతం నమోదైంది. బుక్కపట్నం, రామగిరి మండలాల్లో 35.6 మిమీ, కొత్తచెరువు 28.6 మి.మీ, పుట్టపర్తి 24.6 మి.మీ, కనగానపల్లి 17.2 మి.మీ, కదిరి 15.2 మి.మీ, అమరాపురం 14.6 మి.మీ, నల్లమాడ, గాండ్లపెంట మండలాల్లో 13.6 మి.మీ, తనకల్లు 9.4 మి.మీ, నల్లచెరువు 8.4 మి.మీ, ధర్మవరం 7.4 మి.మీ మేర వర్షం కురిసింది. తాజా వర్షాలు ఖరీఫ్ పంటలకు ఎంతో మేలు చేస్తాయని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. ఇప్పటికీ విత్తనం వేయని వారు వెంటనే ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని సూచిస్తున్నారు.

పిచ్చికుక్క స్వైరవిహారం

- 13 మందికి గాయాలు


గాయపడిన బైలమ్మ


ఆదినారాయణ

రొద్దం: మండల పరిధిలోని తురకలాపట్నంలో శుక్రవారం ఉదయం ఓ పిచ్చికుక్క స్వైర విహారం చేసింది. 13 మందిపై దాడి చేసి గాయపరిచింది. కుక్కదాడిలో నారాయణరెడ్డి, హనుమంతు, ఆదినారాయణ, గంగాధర్, గంగమ్మ, బైలమ్మ, శ్రీనివాసులు, హరీఫ్, ఇర్ఫాన్, హేమస్వరూప్‌తో పాటు మరో ముగ్గురు గాయపడ్డారు. స్పందించిన స్థానికులు క్షతగాత్రులను 108 వాహనంలో పెనుకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. ఆదినారాయణ, బైలమ్మ పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతపురం తరలించి చికిత్స చేయిస్తున్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం


రేషన్ బియ్యాన్ని పట్టుకున్న విజిలెన్స్ అధికారులు

గోరంట్ల: కర్ణాటక రాష్ట్రం బంగారుపేటకు ఐచర్ వాహనంలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు శుక్రవారం పట్టుకున్నారు. విజిలెన్స్ సీఐ రామరావు వివరాల మేరకు... అనంతపురం మండలం నాగిరెడ్డిపల్లికి చెందిన మారుతీ అనే వ్యక్తి ఐచర్ వాహనం (ఏపీ02టీబీ 9831)లో 104 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని కర్ణాటక రాష్ట్రం బంగారుపేటకు తరలిస్తున్నారు. పక్కా సమాచారం మేరకు సిబ్బందితో కలసి మండల పరిధిలోని కొండాపురం క్రాస్ వద్ద బియ్యాన్ని పట్టుకున్నామని చెప్పారు. ముద్దాయి మారుతీని విచారించగా అనంతపురం జిల్లా నార్పల, బుక్కరాయసముద్రం మండలాల్లో రేషన్‌కార్డు లబ్ధిదారుల నుంచి సేకరించిన బియ్యాన్ని కర్ణాటక రాష్ట్రంలోని బంగారుపేటలో విక్రయించడానికి తీసుకెళ్తున్నట్లు చెప్పారని సీఐ రామరావు వివరించారు. మారుతీపై కేసు నమోదు చేసి రేషన్‌ను గోరంట్ల స్టాక్ పాయింట్‌కు తరలించామన్నారు. ఐచర్ వాహనాన్ని గోరంట్ల పోలీసులకు అప్పగించినట్లు పేర్కొన్నారు.

ఉంతకల్లు వద్ద హెచ్చెల్సీకి పైపింగ్


పైపింగ్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

బొమ్మనహాళ్: ఉంతకల్లు సమీపంలోని 113-557వ కిలోమీటరు వద్ద హెచ్చెల్సీకి శుక్రవారం తెల్లవారుజామున పైపింగ్ పడింది. గమనించిన సిబ్బంది వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. కణేకల్లు హెచ్చెల్సీ డీఈఈ మద్దిలేటి ఆధ్వర్యంలో అధికారులు పైపింగ్‌ను పరిశీలించారు. ప్రస్తుతం సరిహద్దులో హెచ్చెల్సీకి 1,800 క్యూసెక్కులు నీరు విడుదల అవుతుండగా.. అందులో 400 క్యూసెక్కులు తగ్గిస్తున్నట్లు తెలిపారు. ఉంతకల్లు వద్ద పడిన రంధ్రాన్ని తాత్కాలికంగా మట్టిబస్తాలు వేసి పూడ్చే పనులు చేపట్టామన్నారు. జేసీబీ సహాయంతో గట్టును తవ్వి రంధ్రం గుర్తించి మళ్లీ పటిష్టీకరిస్తామన్నారు.

అతివకు ఆర్థిక భరోసా

- ఖాతాల్లోకి 'వైఎస్సార్ సున్నావడ్డీ' సొమ్ము
- వరుసగా నాలుగో ఏడాదీ అమలు చేసిన జగన్ సర్కార్
- 30,360 సంఘాల్లోని 3.91 లక్షల మందికి లబ్ధి
- రూ.52.38 కోట్ల చెక్కు అందజేత


మెగాచెక్కు అందజేస్తున్న మంత్రి గుమ్మనూరు జయరాం, ఎమ్మెల్యే సిద్దారెడ్డి, కలెక్టర్ అరుణ్‌బాబు, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ తదితరులు

పుట్టపర్తి అర్బన్: మహిళా సాధికారతకు పెద్ద పీట వేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. మహిళా లోకానికి అండగా నిలుస్తూ ఆర్థిక భరోసా కల్పిస్తున్నారు. ముఖ్యంగా స్వయం సహాయక సంఘాల్లోని మహిళలకు 'వైఎస్సార్ సున్నా వడ్డీ' ద్వారా ప్రయోజనం చేకూరుస్తున్నారు. బ్యాంకుల ద్వారా రుణాలు తీసుకుని సక్రమంగా చెల్లించిన సంఘాల్లోని సభ్యులకు క్రమం తప్పకుండా వడ్డీ సొమ్ము ఖాతాల్లో జమ చేస్తూ వారి ఆర్థిక స్వావలంబనకు కృషి చేస్తున్నారు. ఇప్పటికే మూడేళ్లుగా ఈ పథకం కింద నిధులు మంజూరు చేశారు. తాజాగా శుక్రవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం మండలం జనుపల్లి సభ నుంచి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ సున్నా వడ్డీ నాలుగో విడత నిధులను కంప్యూటర్ బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ అరుణ్‌బాబు, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి గుమ్మనూరు జయరాం, కదిరి ఎమ్మెల్యే సిద్దారెడ్డి, జెడ్పీ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో మహిళా సంఘాల సభ్యులతో సమావేశమయ్యారు. జిల్లాలో 30,360 మహిళా సంఘాల్లోని 3,91,440 మంది సభ్యులకు మంజూరైన రూ.52.38 కోట్లకు సంబంధించిన మెగా చెక్కును అందజేశారు.

నాలుగేళ్లలో రూ.195.25 కోట్ల లబ్ధి..

'వైఎస్సార్ సున్నావడ్డీ'పథకం కింద జిల్లాలోని 30,360 మహిళా సంఘాల్లోని సభ్యులకు నాలుగు విడతల్లో రూ.195.25 కోట్ల లబ్ధి కలిగిందని కలెక్టర్ అరుణ్‌బాబు వివరించారు. ప్రభుత్వం అందించే ఆర్థిక సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇంతలా మహిళా సంఘాలను ఆర్థికంగా ఆదుకుంటున్న రాష్ట్రం దేశంలోనే ఎక్కడా లేదన్నారు.

మోసం... చంద్రబాబుకు నైజం

మాటిచ్చి మోసం చేయడం టీడీపీ అధినేత చంద్రబాబు నైజమని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి గుమ్మనూరు జయరాం అన్నారు. మెగా చెక్కు పంపిణీ అనంతరం ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో అలవిగాని హామీలిచ్చి మోసగించడం ఆయనకు అలవాటుగా మారిందన్నారు. 2014 ఎన్నికల సమయంలో డ్వాక్రా రుణాలు మాఫీ, వ్యవసాయ రుణాలు మాఫీ, బంగారు నగలు ఇంటికి తెచ్చిస్తానంటూ హామీలిచ్చిన చంద్రబాబు... అధికారంలోకి రాగానే ఏ ఒక్క హామీ అమలు చేయకుండా అన్ని వర్గాలనూ మోసం చేశారన్నారు. అందువల్లే 2019 ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలంతా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతు తెలిపి 151 స్థానాల్లో గెలిపించారన్నారు. సీఎంగా బాధ్యతలు తీసుకున్న నిమిషం నుంచి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగానే పాలన సాగిస్తున్నారన్నారు. ప్రజలకిచ్చిన హామీలన్నీ తూచా తప్పకుండా నెరవేరుస్తూ మహిళలకు అండగా నిలుస్తున్నారన్నారు. ఇంతలా ఆదుకున్న సీఎం దేశంలో ఎవరూ లేరన్నారు. అందువల్లే జనమంతా మళ్లీ జగనే కావాలని కోరుకుంటున్నారని, ప్రజా మద్దతుతో ఈ సారి ఎన్నికల్లో 175 ఎమ్మెల్యే స్థానాలను గెలిచి వైఎస్సార్‌సీపీ చరిత్ర సృష్టించబోతోందన్నారు. ఎంత మంది కలసి వచ్చినా జగన్ జైత్రయాత్రను ఆపలేరన్నారు.

ఓటమి భయంతో రాక్షసక్రీడ..

కదిరి ఎమ్మెల్యే సిద్దారెడ్డి, జెడ్పీ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ...రాష్ట్రంలో జనరంజక పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అన్ని వర్గాల నుంచి సంపూర్ణ మద్దతు లభిస్తోందన్నారు. అలాగే అభివృద్ధిలో రాష్ట్రం దూసుకుపోతోందన్నారు. వీటన్నింటినీ చూసి చంద్రబాబుకు ఓటమి భయం పట్టుకుందన్నారు. అందువల్లే నీచ రాజకీయాలు చేస్తూ, రాక్షసక్రీడ ఆడుతున్నారన్నారు. ఆయన జనసేనతో వచ్చినా, ఇంకే పార్టీతో పొత్తుపెట్టుకుని వచ్చినా ఈసారీ ఓటమి తప్పదన్నారు. కార్యక్రమంలో పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్, డీఆర్‌ఓ కొండయ్య, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, జిల్లా అగ్రీ అడ్వయిజరీ బోర్డు చైర్మన్ అవుటాల రమణారెడ్డి, జిల్లా మెప్మా అధ్యక్షురాలు సాయిలీల, 'పుడా' చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ, మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబుళపతి తదితరులు పాల్గొన్నారు.

రూ.లక్షకుపైగా అందింది



నేను శ్రీవినాయక మహిళా సంఘంలో సభ్యురాలిని. నాలుగేళ్లలో వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం కింద మా సంఘానికి రూ.లక్షకుపైగా సాయం అందింది. డ్వాక్రా రుణమాఫీ సైతం నాలుగేళ్లుగా అందుకుంటూ ఉన్నాం. స్వయం సహాయక సంఘాల మహిళలకు ఇంతకన్నా ఇంకేమి కావాలి.

– సుధారాణి, కాళసముద్రం, కదిరి

జగనన్న చెబితే చేస్తాడు



గత ఎన్నికల సమయంలో మహిళలంతా కోరగా.. ఆర్థిక భరోసా ఇస్తానని జగనన్న చెప్పారు. అధికారంలోకి వచ్చినప్పటి మహిళలకు మేలు జరిగేలా పథకాలు అమలు చేస్తున్నారు. అందుకే జగనన్న అంటే మహిళా లోకానికి ఒక భరోసా. మేమంతా ఎప్పటికీ ఆయన వెంటే నడుస్తాం.

– తిప్పమ్మ, గుడిబండ

మహిళల అదృష్టం



జగనన్న మన సీఎంగా ఉండటం మహిళలు చేసుకున్న అదృష్టం. గతంలో చంద్రబాబు రుణమాఫీ హామీ చెప్పి మహిళలను మోసగించారు. టీడీపీ హయాంలో సంఘాలన్నీ నిర్వీర్యమయ్యాయి. సీఎం వైఎస్ జగన్ చెప్పిన పథకాలే కాకుండా చెప్పనివీ చేస్తూ ఓ అన్నలా ఆదుకుంటున్నారు.

– కవిత, బ్రాహ్మణపల్లి, పుట్టపర్తి మండలం

పంచాయతీ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి


మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: జిల్లాలోని ఓ సర్పంచ్, 28 వార్డు మెంబర్ల స్థానాలకు ఈ నెల 19న నిర్వహించనున్న ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన కలెక్టరేట్ నుంచి మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, తహసీల్దార్లు, వైద్య సిబ్బందితో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్ పక్కాగా అమలు చేయాలన్నారు. బ్యాలెట్ పేపర్లు సిద్ధం చేయాలని, ఈనెల 19 నాటికి పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. ఎన్నికల నియమావళి ప్రకారం అధికారులకు శిక్షణ కార్యక్రమాలు, సమస్యాత్మక గ్రామాల్లో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే రెండేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న సచివాలయ ఉద్యోగులకు పేస్కేల్ వర్తించే విధంగా ప్రొబేషన్ డిక్లేర్ చేయాలని సూచించారు.

పోస్టాఫీసుల్లో జాతీయ జెండాల విక్రయం

అనంతపురం సిటీ: తపాలా శాఖ ఆధ్వర్యంలో జాతీయ జెండాలను విక్రయించనున్నట్లు ఆ శాఖ పీఆర్‌ఓ ప్రమోద్ శుక్రవారం తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమం విజయవంతం కోసం 30 x 20 నిడివి ఉన్న జాతీయ జెండాను ప్రత్యేకంగా రూపొందించినట్లు వివరించారు. ప్రజల్లో జాతీయ భావాన్ని, దేశ భక్తిని పెంపొందించే క్రమంలో ఒక్కో జెండా కేవలం రూ.25లకే విక్రయించనున్నట్లు వెల్లడించారు. జిల్లాలోని హెడ్, సబ్, బ్రాంచ్ పోస్టాఫీసుల్లో అందుబాటులో ఉంచామన్నారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కదిరి అభివృద్ధికి కలసి సాగుదాం

- అధికారులు సమన్వయంతో పని చేయాలి
- సమస్యలన్నింటినీ పరిష్కరించాలి
- జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి గుమ్మనూరు జయరాం
- కలెక్టరేట్‌లో కదిరి నియోజకవర్గ అభివృద్ధిపై సమీక్ష


సమీక్ష సమావేశంలో పాల్గొన్న జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి గుమ్మనూరు జయరాం, ఎమ్మెల్యే సిద్దారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, కలెక్టర్ అరుణ్‌బాబు, సబ్ కలెక్టర్ కార్తీక్ తదితరులు

పుట్టపర్తి అర్బన్: కదిరి నియోజకవర్గ అభివృద్ధికి అందరం కలసి కట్టుగా ముందుకు సాగుదామని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి గుమ్మనూరు జయరాం పిలుపునిచ్చారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో కదిరి ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి అధ్యక్షతన కదిరి నియోజకవర్గ అభివృద్ధిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రితో పాటు కలెక్టర్ అరుణ్‌బాబు, సబ్ కలెక్టర్ కార్తీక్, జెడ్పీ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ, డీఆర్‌ఓ కొండయ్య, ఆర్డీఓ రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి గుమ్మనూరు జయరాం మాట్లాడుతూ, సమావేశంలో ప్రస్తావించిన సమస్యలను పరిష్కరించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. నవరత్న పథకాల ద్వారా అర్హులందరికీ న్యాయం చేయాలన్నారు. నియోజక వర్గాన్ని మరింత అభివృద్ధి చేసి మోడల్‌గా నిలిపేందుకు ఎమ్మెల్యే సిద్దారెడ్డి తాపత్రయ పడుతున్నారని, అధికారులు ఆయనకు తగిన సహకారం అందించాలన్నారు. అలాగే అభివృద్ధి పనుల్లో పురోగతి చూపించాలని, సమస్యలు, పెండింగ్ పనులపై సమగ్ర నివేదిక తయారు చేసి జాయింట్ కలెక్టర్‌కు నివేదిక అందజేయాలన్నారు.

సమస్యలు పరిష్కరించి అభివృద్ధికి సహకరించాలి..

కదిరి ఎమ్మెల్యే సిద్దారెడ్డి మాట్లాడుతూ.. కదిరి బైపాస్ రోడ్డుకు భూ సేకరణ, గాండ్లపెంటలో లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం, కుటాగుళ్ల రైల్వే ఓవర్ బ్రిడ్జి పూర్తి, మున్సిపల్ పరిధిలో హౌసింగ్, తలుపుల మండలంలో కొత్తపల్లి, ఓబుళరెడ్డిపల్లి, గుండువారిపల్లి, తనకల్లు మండలంలో కొక్కంటి, కదిరి మండలం పట్నంలలో విద్యుత్ సబ్ స్టేషన్ల ఏర్పాటు, అర్హులకు భూ పంపిణీ, కదిరి మండలం దిగ్గువాయిపల్లి గ్రామంలో ఆర్‌అండ్‌ఆర్ పథకం కింద పరిహారం, కుమ్మరవాండ్లపల్లిలో ఇంటి పట్టాల పంపిణీ, కదిరి మున్సిపాలిటీలో ఇళ్లులేని నిరుపేదలను గుర్తించి 90 రోజుల్లో పట్టాల పంపిణీ, ఇసుక రీచ్‌లు ఏర్పాటుతో పాటు ప్రభుత్వ ప్రాధాన్యత భవనాల నిర్మాణాలు పూర్తికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఇసుక సమస్య ఉందని, 7 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల భవన నిర్మాణాల బిల్లులు మంజూరు చేయాలన్నారు. నియోజక వర్గానికి 4,798 గృహాలను మంజూరు చేయాలన్నారు. రూ.49 కోట్లతో ఏర్పాటవుతున్న గాండ్లపెంట లిఫ్ట్ ఇరిగేషన్ పనులకు జీఓ ఇచ్చే విధంగా సంబంధిత అధికారులు కృషి చేయాలన్నారు. దీనిపై జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి గుమ్మనూరు సానుకూలంగా స్పందించారు. తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం కలెక్టర్ అరుణ్‌బాబు మాట్లాడుతూ.. జిల్లాలో భూమి లేని 2,740 మంది నిరుపేదలకు 3,855 ఎకరాలు పంపిణీ చేసేందుకు అసైన్‌మెంట్ కమిటీ ఆమోదం తెలిపిందన్నారు. ఆగస్టు 17 నుంచి 19 వ తేదీ వరకూ క్షేత్రస్థాయిలో పర్యటించి భూ సేకరణ అంశాలపై నివేదికలు సిద్ధం చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా అగ్రీ అడ్వయిజరీ బోర్డు చైర్మన్ అవుటాల రమణారెడ్డి, 'పుడా'చైర్ పర్సన్ లక్ష్మీనరసమ్మ, మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబుళపతి, సీపీఓ విజయ్‌కుమార్, హౌసింగ్ పీడీ చంద్రమౌళిరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, డ్వామా పీడీ రామాంజనేయులు, జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు, డీఎంహెచ్‌ఓ కృష్ణారెడ్డి, జిల్లా పరిశ్రమల అధికారి చాంద్‌బాషా, సివిల్ సప్లయీస్ అధికారి వంశీకృష్ణారెడ్డి, నోడల్ ఆఫీసర్ శివారెడ్డి, ఈఈ సతీష్‌రెడ్డి, మున్సిపల్ ఏఈ మురళీ, టూరిజం అధికారి నాగేశ్వర్‌రెడ్డి, తహసీల్దార్లు, ఎంపీడీఓలు పాల్గొన్నారు.

టమాట ధర.. దిగొచ్చెనంట!



- కిలో గరిష్ట ధర రూ.50
- మార్కెట్‌కు పెరిగిన సరుకు
- నింగినంటిన ధరలు దిగువకు
- సామాన్య ప్రజలకు భారీ ఊరట

అనంతపురం అగ్రికల్చర్: టమాట ధరలు తగ్గుముఖం పట్టాయి. సాధారణ స్థాయికి చేరుకోవడంతో వినియోగదారులకు ఊరట లభించింది. మార్కెట్‌కు పెద్ద ఎత్తున సరుకు వస్తుండటంతో ధరలకు క్లాం పడుతోంది. 20 రోజులుగా పట్టపగ్గాల్లేకుండా నింగినంటిన టమాట ధర చరిత్ర సృష్టించింది. ఓ దశలో కిలో రూ.160 పలకడంతో రైతు ఇంట పంట పండించిన టమాట ఇపుడు సాధారణ స్థాయికి చేరువవుతోంది. వారం కిందట వరకు మార్కెట్‌కు 100 నుంచి 250 టన్నులు మాత్రమే అమ్మకానికి రాగా... ఇపుడు 2 వేల టన్నుల మార్క్‌ను అధిగమించి రోజురోజుకూ పెరుగుతోంది. అన్నమయ్య జిల్లా మదనపల్లి, కర్ణాటకలోని కోలార్ తర్వాత పెద్దమార్కెట్‌గా ఉన్న 'అనంత'ను ఉమ్మడి జిల్లాతో పాటు పక్కనున్న కర్ణాటక ప్రాంతం నుంచి రైతులు మార్కెట్‌ను ఆశ్రయిస్తున్నారు. గడిచిన నెల రోజుల్లో చాలామంది రైతులు నష్టాల నుంచి ఆర్థికంగా గట్టెక్కారు. ఈ నెలంతా గరిష్ట ధరలు పలికే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు అంచనా వేయగా.. రైతులు పెద్ద ఎత్తున ఆశలు పెట్టుకున్నారు. కానీ... సరుకు పెరగడంతో ధరలు తగ్గుముఖం పడుతూ వస్తున్నాయి. ఈస్థాయి ధరలు కొన్ని రోజుల పాటు నిలకడగా ఉంటే రైతులకు గిట్టుబాటు లభిస్తుందని చెబుతున్నారు. కాగా శుక్రవారం అనంతపురం శివారులోని కక్కలపల్లి మండీలో కిలో టమాట గరిష్ట ధర రూ.50 పలికినట్లు రాప్తాడు మార్కెట్ కమిటీ సెక్రటరీ రామ్‌ప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు 2,550 టన్నుల సరుకు అమ్మకానికి రాగా వాటిని బహిరంగ వేలం వేశారు. కిలో గరిష్ట ధర రూ.50, కనిష్టం రూ.26, సరాసరి రూ.35 చొప్పున అమ్మకాలు సాగాయి.

'సెబ్' సూపరింటెండెంట్‌కు షోకాజ్

- ఆఫీసులో మంచం వేసుకుని నిద్రించడంపై కలెక్టర్ సీరియస్
- 'సెబ్'లో ఏం జరుగుతోందని ఎస్పీ మాధవరెడ్డి ఆరా

సాక్షి ఎఫెక్ట్..

సాక్షి, పుట్టపర్తి: సెబ్ కార్యాలయంలోని తన చాంబర్‌ను పడక గదిగా మార్చుకున్న సెబ్ (స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ బ్యూరో) సూపరింటెండెంట్ రవికుమార్‌కు షోకాజ్ నోటీసులివ్వాలని కలెక్టర్ పి.అరుణ్‌బాబు డీఆర్‌ఓ కొండయ్యను ఆదేశించారు. తన చాంబర్‌లోనే మంచం వేసుకుని సేదదీరుతున్న సూపరింటెండెంట్ రవికుమార్ వీడియో వైరల్ కాగా 'ఏమి హాయిలే ఇలా'శీర్షికతో 'సాక్షి'కథనం ప్రచురించింది. దీనిపై కలెక్టర్ తీవ్రంగా స్పందించారు. మిగతా అధికారుల పనితీరు గురించి తెలుసుకోవాలని ఆదేశించారు. మరోవైపు ఎస్పీ మాధవరెడ్డి కూడా రవికుమార్ వ్యవహార శైలిపై ఆరా తీశారు. అతను విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నా.. తన దృష్టికి ఎందుకు తీసుకురాలేకపోయారని స్పెషల్ బ్రాంచ్ సిబ్బందిని మందలించినట్లు తెలుస్తోంది. పోలీసు వ్యవస్థకు చెడ్డపేరు తెచ్చేవిధంగా వ్యవహరిస్తే తగిన మూల్యం చెల్లించుకుంటారని హెచ్చరించారు.

సత్యసాయికి నృత్యనీరాజనం



చిన్నారుల జానపద నృత్యప్రదర్శన

ప్రశాంతి నిలయం: ఒడిస్సీ నృత్యంతో చిన్నారులకు సత్యసాయికి నీరాజనాలు పలికారు. పర్తియాత్రలో భాగంగా పుట్టపర్తికి విచ్చేసిన ఒడిశా సత్యసాయి భక్తులు రెండో రోజు శుక్రవారం సత్యసాయి సన్నిధిలో ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఒడిశాలోని బౌధ్ జిల్లాకు చెందిన బాలవికాస్ విద్యార్థులతో పాటు, భంజానగర్‌కు చెందిన సత్యసాయి విద్యా విహార్ విద్యార్థులు ఒడిశా సంస్కృతీ, సంప్రదాయాలను ప్రతిబింబించే జానపద నృత్యప్రదర్శన నిర్వహించారు. తమ రాష్ట్రానికి చెందిన ప్రముఖుల విజయగాథలను నృత్యరూపకంలో వివరించారు. ఒడిశా రాష్ట్ర కేబినెట్ మంత్రులు జగన్నాథ్ సర్కార్, సవ్యసాచి నాయక్ వేడుకల్లో పాల్గొని సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. అంతకుముందు సత్యసాయి సేవా సంస్థల ఒడిశా రాష్ట్ర అధ్యక్షుడు స్వరూప్ పట్నాయక్ తమ రాష్ట్రంలో అమలవుతున్న సత్యసాయి సేవా కార్యక్రమాలను వివరించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించిన భక్తులకు సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె రత్నాకర్ రాజు, ట్రస్ట్ సభ్యుడు చక్రవర్తి నూతన వస్త్రాలు, జ్ఞాపికలను బహూకరించారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు దరఖాస్తు చేసుకోండి

ప్రశాంతి నిలయం: నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్ షిప్ పరీక్ష (ఎన్‌ఎంఎంఎస్)కు ఈ విద్యాసంవత్సరం 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి మీనాక్షి శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్, ఎయిడెడ్, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలతో పాటు వసతి సౌకర్యం లేని ఆదర్శ పాఠశాలల విద్యార్థులు దరఖాస్తుకు అర్హులన్నారు. విద్యార్థుల కుటుంబ వార్షికాదాయం రూ.3.5 లక్షల్లోపు ఉండాలన్నారు. జనరల్, బీసీ కేటగేరీ విద్యార్థులు రూ.100, ఎస్సీ, ఎస్టీ కేటగిరీ విద్యార్థులు రూ.50 పరీక్ష రుసుం చెల్లించి సెప్టెంబర్ 15వ తేదీలోపు www.bse.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 10 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రింటెడ్ నామినల్ రోల్స్‌తోపాటు ధ్రువీకరణపత్రాలను సెప్టెంబర్ 19వ తేదీలోపు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో సమర్పించాలన్నారు. డిసెంబర్ 3న పరీక్ష ఉంటుందని డీఈఓ వెల్లడించారు.

'సెర్ప్' ఉద్యోగుల సంబరాలు


డీఆర్‌డీఏ కార్యాలయంలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న సెర్ప్ ఉద్యోగులు

- సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

పుట్టపర్తి అర్బన్: 'సెర్ప్'ఉద్యోగులు, సిబ్బందికి ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. 'సెర్ప్'(డీఆర్‌డీఏ, వెలుగు) ఉద్యోగుల జీతాలు 23 శాతం పెంచుతున్నట్లు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం అమలాపురం సభలో తెలిపారు. ఆ వెంటనే జీఓను విడుదల కాగా, 'సెర్ప్'ఉద్యోగులు సంబరాల్లో మునిగిపోయారు. కలెక్టరేట్‌కు వెళ్లి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి గుమ్మనూరు జయరాంకు స్వీట్లు పంచి పెట్టారు.

జిల్లాలో 261 మంది: ప్రభుత్వ నిర్ణయంతో జిల్లాలో 'సెర్ప్'లో పని చేస్తున్న 261 మంది ఉద్యోగులకు ప్రయోజనం కలగనుంది. ఇందులో ప్రాజెక్టు మేనేజర్, డీపీఎంలు, ఏపీఎంలు, సీసీలు ఉన్నారు. వీరంతా శుక్రవారం డీఆర్‌డీఏ కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. 23 శాతం జీతాలు పెంచిన రాష్ట్ర ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు చెప్పారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, శివమ్మ, డీపీఎం రామ్మోహన్, డీపీఎం రామిరెడ్డి, ఏపీఎంలు, జిల్లా యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్



గంజాయితో పాటు నిందితుడి అరెస్టు చూపుతున్న పోలీసులు

హిందూపురం అర్బన్: హిందూపురం రైల్వేస్టేషన్‌లో అక్రమంగా గంజాయి తరలిస్తున్న వ్యక్తిని రైల్వే పోలీసులు శుక్రవారం వేకువ జామున అరెస్ట్ చేశారు. రైల్వే సీఐ నాగరాజు వివరాలమేరకు... లోకమాణ్యతిలక్ నుంచి కోయంబత్తూరు వెళ్తున్న రైలు హిందూపురం చేరుకోగానే ఓ వ్యక్తి రెండు పాకెట్లలో ఉన్న సరకుతో రైలు నుంచి దిగి అనుమానంగా తిరుగుతుండగా ఎస్‌ఐ బాలాజీనాయక్, సిబ్బందికి అనుమానం వచ్చి వరుణ్‌కుమార్ అనే వ్యక్తిని తనిఖీ చేశారని చెప్పారు. అతని వద్ద రెండు ప్యాకెట్లలో 10 కిలోల గంజాయి దొరికిందన్నారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.40 వేలు ఉంటుందన్నారు. వరుణ్‌ను తహసీల్దార్ సమక్షంలో విచారించి కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం రైల్వేకోర్టుకు తరలించామన్నారు.

జూదరుల అరెస్ట్



పోలీసులు స్వాధీనం చేసుకున్న నగదు, మొబైల్‌ఫోన్లు, ద్విచక్ర వాహనాలు

గుడిబండ: మండల పరిధిలోని పూజారిపల్లి గ్రామ పొలిమేరలో పేకాట శిబిరంపై దాడి చేసి 12 మందిని అదుపులోకి తీసుకున్నట్లు మడకశిర సీఐ సురేష్‌బాబు, గుడిబండ ఎస్‌ఐ మునిప్రతాప్ తెలిపారు. వారి వద్ద నుండి రూ.2,61,150 నగదు, 12 మొబైల్‌ఫోన్లు, 5 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

పాముకాటుతో వ్యక్తి మృతి

చిలమత్తూరు: మండలంలోని తుమ్మలకుంట గ్రామానికి చెందిన చిన్నగంగప్ప(70) పాముకాటుతో గురువారం రాత్రి మృతి చెందారు. కుటుంబ సభ్యుల వివరాల మేరకు... మూడు రోజుల క్రితం పాముకాటు వేయడంతో బాగేపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించామన్నారు. మెరుగైన వైద్యం అవసరం అని వైద్యులు తెలియజేయడంతో చిక్కబళ్లాపురం, బెంగళూరుకు తరలించామన్నారు. అయితే అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో చిన్న గంగప్ప మృతి చెందాడన్నారు.

రైలు పట్టాలపై మృత్యుఘోష

పెద్దలు మందలించారని కొందరు... ప్రేమ పెళ్లికి ఒప్పుకోలేదని మరికొందరు.. అనారోగ్య సమస్యలతో ఇంకొందరు కారణాలు ఏవైనా రైలు పట్టాలకు రక్తపు మరకలు అంటుతున్నాయి. నిత్యం ఏదో ఒక చోట రైల్వే పట్టాలపై నిండు ప్రాణాలు గాల్లో కలసి పోతున్నాయి.



- ఆత్మహత్యలకు కేరాఫ్‌గా రైల్వేట్రాక్‌లు
- చిన్న చిన్న కారణాలతోనే బలవన్మరణాలు
- కర్ణాటక సరిహద్దులోనే ఎక్కువ

హిందూపురం అర్బన్: రైలు పట్టాలపై మృత్యు గంట మోగుతోంది. వేర్వేరు కారణాలతో రైళ్ల కింద పడుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. జిల్లాలో ఎక్కడో ఒక చోట ఈ ఘటనలు చోటు చేసుకుంటూనే ఉన్నాయి. రెండేళ్ల రికార్డులను పరిశీలిస్తే ముఖ్యంగా 20 నుంచి 30 ఏళ్ల యువతే బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. చదువులో ఒత్తిళ్లు, మార్కులు తక్కువ వచ్చాయని, ప్రేమ విఫలం, నిరుద్యోగం, ఆర్థిక సమస్యలు, కుటుంబాల్లో కలహాలు ఇలా ఏదో ఒక సమస్యతో నిండు ప్రాణాలను పట్టాలకు బలి ఇస్తున్నారు. అయితే వీరిలో ఎక్కువ మంది క్షణికావేశంతో ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటున్నట్లు వైద్య నిపుణులు చెబుతున్నారు.



హిందూపురం రైల్వేస్టేషన్

కర్ణాటక సరిహద్దులోనే ఎక్కువ..

ధర్మవరం వైపు నుంచి బెంగళూరు మధ్య నిత్యం 22 వరకు ఎక్స్‌ప్రెస్, ప్యాసింజర్ రైళ్లు తిరుగుతుంటాయి. అలాగే 30 వరకూ గూడ్స్ రైళ్లు వెళ్తుంటాయి. కర్ణాటక సరిహద్దులోని తూమకుంట, మోడల్‌కాలనీ, గుడ్డం, మలగూరు గేట్, పెనుకొండ, తదితర ప్రాంతాల్లో ఎక్కువ మంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నట్లు రికార్డులు చెబుతున్నాయి.

గత ఏడాది 49 మంది..

- ఈ ఏడాది మార్చి 12న దేవరపల్లి రైల్వేగేట్ సమీపంలో ఓ యువకుడు రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ప్రేమ విఫలమై మృతి చెందినట్లు విచారణలో తేలింది.
- జూన్ 17న గుడ్డం సమీపంలో ఓ వృద్ధుడి మృతదేహం రైల్వే ట్రాక్‌పై లభ్యమైంది. విచారిస్తే ఇంట్లో కలహాలతో ఆత్మహత్యకు పాల్పడినట్లు తేలింది.
- హిందూపురం రైల్వేస్టేషన్ పరిధిలో 2020-2021లో 41 మంది, 2021-2022లో 49 మంది, 2022-2023 జూలై వరకు 11 మంది రైలు పట్టాలపై బలవన్మరణాలకు పాల్పడ్డారు.

కాపాలా లేని గేట్లు ఎక్కువే..

ప్రధాన గేట్ల వద్ద మినహా మిగిలిన చిన్న చిన్న గేట్ల వద్ద కాపలాదారులు ఉండటం లేదన్న విమర్శలు బలంగా ఉన్నాయి. కర్ణాటక సరిహద్దు నుంచి సౌత్ వెస్ట్రన్ రైల్వే పరిధి ధర్మవరం వరకూ 160 కిలోమీటర్లు ఉంది. దీంతో ఒక్కోసారి ఒకటి రెండు రోజులైనా ఆత్మహత్య కూడా వెలుగులోకి రావడం లేదు. తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాలు గుర్తించి తనిఖీలు చేస్తే ఆత్మహత్యలను నివారించవచ్చని నిపుణులు చెబుతున్నారు. ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలంటున్నారు.

చావే పరిష్కారం కాదు



అన్నింటికి చావే పరిష్కారం కాదు. బతకలేమని నిర్ణయించుకొనే వారు తరచూ కుటుంబ సభ్యులు, మిత్రుల వద్ద నైరాశ్యం వ్యక్తం చేస్తుంటారు. ఆ సమయంలో బాధితుల్లో మనోధైర్యం నింపాలి. ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుంది. చిన్న వయస్సులో యువత ఆకర్షణలకు గురై దాన్ని సాధించలేనప్పుడు ఆత్మహత్యల వరకూ వెళ్తున్నారు. దీనికి తోడు డ్రగ్స్, మత్తుకు అలవాటు పడి మానసికంగా మతిస్థిమితం కోల్పోయి కూడా కొందరు ఆత్మహత్యలతో పాటు ప్రమాదాలకు గురై ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. తల్లిదండ్రుల పర్యవేక్షణ కూడా చాలా అవసరం. – సురేష్‌కుమార్, మానసిక వైద్య నిపుణులు

చిన్న కారణాలతోనే..



ఈ మధ్య చిన్న కారణాలతోనే ఆత్మహత్యలకు పాల్పడున్న వారు ఎక్కువగా ఉన్నారు. ప్రతి కేసు విచారణలో ఇదే తేలుతోంది. క్షణికావేశంతో రైలు పట్టాలపై ఆత్మహత్య చేసుకుంటున్నారు. మృతుల్లోనూ ఎక్కువగా యువత, వృద్ధులు ఉంటున్నారు. అనుమతులు లేని చోట ట్రాక్ దాటడం, రైళ్లలో ఊగుతూ, నిర్లక్ష్యంగా ప్రయాణించడంతో కూడా ప్రమాదాలు జరుగుతున్నాయి. – బాలాజీనాయక్, రైల్వే ఎస్‌ఐ, హిందూపురం

రైలు కిందపడి లారీడ్రైవర్ మృతి



మృతుడు షెక్షావలి

యాడికి: మండలంలోని పెద్దపేట గ్రామానికి చెందిన ఓ లారీడ్రైవర్ గురువారం రాత్రి కర్ణాటక రాష్ట్రంలోని గదగ్‌లో రైలు కిందపడి మృతి చెందాడు. గ్రామస్తుల వివరాల మేరకు .. పెద్దపేటకు చెందిన షెక్షావలి (45) లారీ డ్రైవర్‌గా విధులు నిర్వహించేవాడు. షెక్షావలి కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. అయితే గురువారం మధ్యాహ్నం షెక్షావలి ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లి రాయలచెరువులోని రైల్వేస్టేషన్‌లో టికెట్ తీసుకొని తిరుపతి నుంచి గదగ్ వెళ్లే ప్యాసింజర్ రైలు ఎక్కాడు. గదగ్ రైల్వేస్టేషన్‌లో దిగిన తర్వాత రైలు కింద పడటంతో ప్రాణాలు కోల్పోయాడు. మృతుడి జేబులో ఉన్న సమాచారంతో రైల్వే పోలీసులు శుక్రవారం ఉదయం యాడికి పోలీసులకు సమాచారం ఇచ్చారు. యాడికి పోలీసుల ద్వారా సమాచారం అందుకున్న షెక్షావలి భార్య, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు, వారి బంధువులు మృతదేహాన్ని తీసుకొచ్చేందుకు గదగ్‌కు వెళ్లారు.

చావుబతుకుల మధ్య కానిస్టేబుల్ సతీమణి

- ఆపరేషన్‌కు రూ.10 లక్షలు అవసరమన్న వైద్యులు
- దాతల సాయం కోసం ఎదురు చూస్తున్న కుటుంబ సభ్యులు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అనిత

అనంతపురం శ్రీకంఠం సర్కిల్: రెండు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ కిరణ్‌కుమార్ మృతి చెందిన విషయం తెలిసిందే. ఇదే ప్రమాదంలో తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలోకి వెళ్లిన కానిస్టేబుల్ సతీమణి అనిత ఆరోగ్య పరిస్థితి విషమిస్తున్నట్లు బెంగళూరు వైద్యులు తెలిపారు. ఆమెకు ఆపరేషన్ చేస్తే కోలుకునే అవకాశం ఉందని, రూ.10 లక్షలు ఖర్చు అవుతుందని వైద్యులు చెప్పారు. ఇంటి పెద్ద కిరణ్ చనిపోవడంతో వారి పిల్లలు చిన్నారులు కావడంతో చేతిలో డబ్బులు లేక ఆ కుటుంబం చేయూత కోసం ఎదురుచూస్తోంది. ఆర్థికసాయం చేయదలచిన వారు గూగుల్ పే, ఫోన్‌పే 9949821343 నంబరుకు కానీ, పేరు: జి.నాగరాజు, బ్యాంకు అకౌంట్ నంబర్ 31608242623, ఐఎఫ్ఎస్‌సీ కోడ్: ఎస్‌బీఐఎన్ 0000806కు గాని సహాయం చేయాలని కోరుతున్నారు.

టెండర్ల ఆహ్వానం

పుట్టపర్తి టౌన్: జిల్లాలో ఆరు డిపోల పరిధిలో ఉన్న ఖాళీ స్థలాలు, పక్కా దుకాణాలు, మరుగుదొడ్లు నడుపుకోవడానికి టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ప్రజారవాణా అధికారి మధుసూధన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 14 పక్కా దుకాణాలు , 61 ఖాళీ స్థలాలు , 2 మరుగుదొడ్ల నిర్వహణకు టెండర్లను ఈనెల 17న నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. టెండర్ ఫారాలు అన్ని డిపోల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. టెండర్ ఫారాన్ని పూర్తి చేసి ఈనెల 17 లోపు పుట్టపర్తి పట్టణంలో ఉన్న ఆర్ఎం కార్యాలయంలో మధ్యాహ్నం 2 గంటలలోపు టెండర్ బాక్స్‌లో వేయాలన్నారు. అదే రోజు 3 గంటలకు టెండర్‌దారుల సమక్షంలో టెండర్ల ఖరారు చేస్తామన్నారు.

వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు

పుట్టపర్తి అర్బన్: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉండడంతో ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డీఎంహెచ్ఓ ఎస్వీ కృష్ణారెడ్డి సూచించారు. శుక్రవారం పుట్టపర్తి మండలం బత్తలపల్లిలో వైద్య సిబ్బందితో కలిసి పర్యటించారు. మిషన్ ఇంద్రధనస్సు, ఈ సంజీవిని, పోషకాహారంపై సూచనలు సలహాలిచ్చారు. కార్యక్రమంలో సీహెచ్ఓ నగేష్, ఏఎంఒ లక్ష్మీనాయక్, సబ్ యూనిట్ అధికారి రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా పంద్రాగస్టు వేడుకలు

- ఎస్పీ మాధవరెడ్డి



సూచనలిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి



పరేడ్ నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది

పుట్టపర్తి టౌన్: జిల్లా కేంద్రమైన పుట్టపర్తిలో ఈనెల 15 నిర్వహించే పంద్రాగస్ట్ వేడుకల్లో ఎలాంటి భద్రతా లోపాలు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని ఎస్పీ మాధవరెడ్డి సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం పరేడ్ మైదానంలో జరుగుతున్న పోలీస్ పరేడ్ రిహార్సల్స్‌ను ఎస్పీ మాధవరెడ్డి పరిశీలించి దిశా నిర్దేశం చేశారు. ఎస్పీ మాట్లాడుతూ 15న స్థానిక పరేడ్ మైదానంలో ఉదయం 9 గంటలకు వేడుకలు ప్రారంభమవుతాయన్నారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి గుమ్మనూర్ జయరామ్, కలెక్టర్ అరుణ్‌బాబుతో పాటు జిల్లాలోని ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరవుతారన్నారు. అందువల్ల భద్రత విషయంలో ఎలాంటి లోటు పాట్లు లేకుండా చూడాలన్నారు. వాహనాలు సత్యసాయి ఎయిర్‌పోర్టు రహదారి మీదుగా మళ్లించాలన్నారు.కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ విష్ణు, ఏఆర్ డీఎస్పీ విజయ్‌కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గొర్రెల దొంగల అరెస్ట్

- 30 గొర్రెలు స్వాధీనం



దొంగల నుంచి స్వాధీనం చేసుకున్న గొర్రెలు, వాహనాలతో పోలీసులు

మడకశిర: మండలంలోని బుళ్లసముద్రం వద్ద జరిగిన గొర్రెల చోరీ కేసును మడకశిర పోలీసులు ఐదు రోజుల్లోనే ఛేదించారు. శుక్రవారం మడకశిర పోలీస్ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సీఐ సురేష్‌బాబు, ఎస్‌ఐ లోకేశ్ వివరాల మేరకు.. గుడిబండ మండలం తిమ్మలాపురంకు చెందిన ఈరన్న, కణేకల్లు మండలం గోణాల గ్రామానికి చెందిన రంగస్వామి తమ గొర్రెలను మేత కోసం మడకశిర మండలం బుళ్లసముద్రం వద్దకు తోలుకువచ్చారు. అదే గ్రామ సమీపంలోని ఓ పొలంలో గొర్రెలను మందగా ఉంచారు. ఈ నెల 6న అర్ధరాత్రి కర్ణాటకలోని హొళేటికులోడుకు చెందిన శ్రీనివాసులు, మడకశిర మండలం ఎల్లోటికి చెందిన అనిల్, రొద్దం మండలం కోగిరకు చెందిన నగేష్, రొద్దం మండలం ఎం.కొత్తపల్లికి చెందిన రాజశేఖర్, పావగడ తాలూకా ర్యాపటకు చెందిన రాజగోపాల్, రొద్దం మండలం పెద్దకోడిపల్లికి చెందిన ధర్మ, రొద్దం మండలం ఆర్ఎల్ కొత్తూరుకు చెందిన అశోక్, పావగడ తాలూకా హుసేన్‌పురంకు చెందిన ప్రసన్న పథకం ప్రకారం గొర్రెలను దొంగలించడానికి బుళ్లసముద్రంకు చేరుకున్నారు. ఇందులో భాగంగానే గొర్రెల యజమానులను బెదిరించి 30 గొర్రెలను బొలేరా వాహనంలో తీసుకెళ్లారు. రొద్దం మండలంలోని కోగిరకు చెందిన నగేష్ గొర్రెల దొడ్డికి గొర్రెలను తరలించారు. గొర్రెలను మధుగిరిలో విక్రయించడానికి వీరు పథకం వేసుకున్నారు.శుక్రవారం ఉదయం గొర్రెలను మధుగిరిలో అమ్మడానికి బొలేరా వాహనంలో వేసుకుని రాజశేఖర్, నగేష్, శ్రీనివాసులు రొద్దం మండలం నుంచి కోగిర నుంచి బయలుదేరారు. ఎస్‌ఐ లోకేశ్‌కు దొంగలు గొర్రెలను మధుగిరికి తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో మడకశిర మండలంలోని కదిరేపల్లి క్రాస్‌లో కాపు కాచి ముగ్గురు దొంగలను పట్టుకున్నారు. రూ.3.80 లక్షలు విలువ చేసే 30 గొర్రెలను కూడా దొంగల నుంచి స్వాధీనం చేసుకున్నారు. అలాగే రూ.8 లక్షలు విలువ చేసే బొలేరా, రూ.లక్ష విలువ చేసే ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేశారు. బొలేరా వాహనం రాజశేఖర్‌కు చెందినదిగా పోలీసులు గుర్తించారు. పరారీలో ఉన్న ఐదుగురు దొంగలను కూడా పట్టుకుంటామని పోలీసులు తెలిపారు. స్వాధీనం చేసుకున్న గొర్రెలను సదరు యజమాని ఈరన్నకు అప్పగించామన్నారు. అరెస్ట్ చేసిన నిందితులను కోర్టులో హాజరుపరచినట్లు పేర్కొన్నారు.

అధికారులు హెడ్‌క్వార్టర్స్‌లోనే ఉండాలి



వీసీలో పాల్గొన్న సాంఘిక సంక్షేమ సాధికారత అధికారి శివరంగ ప్రసాద్, అధికారులు

ప్రశాంతి నిలయం: 'వసతి గృహ అధికారులందరూ తప్పనిసరిగా హెడ్‌క్వార్టర్స్‌లో ఉంటూ ఆయా సంక్షేమ వసతి గృహాల్లోని విద్యార్థులను పర్యవేక్షించాలి. లేకపోతే చర్యలు తప్పవు' అని సాంఘిక సంక్షేమశాఖ డైరెక్టర్ విజయకృష్ణన్ స్పష్టం చేశారు. శుక్రవారం అమరావతి నుంచి ఆయన వసతి గృహ అధికారులు, సహాయ సాంఘిక సంక్షేమ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందులో భాగంగానే పుట్టపర్తి కలెక్టరేట్ నుంచి జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారత అధికారి శివరంగ ప్రసాద్, సహాయ సాంఘిక సంక్షేమ అధికారులు శ్రీరాములు, రెడ్డి బాలాజీ, నరసింహారావుతో పాటు జిల్లా వ్యాప్తంగా ఉన్న 26 సాంఘిక సంక్షేమ వసతి గృహ అధికారులు వీసీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన జీ.ఓ 46 స్టాండెడ్ ఆపరేషన్ ప్రోసీజర్స్‌పై సమీక్ష నిర్వహించారు.

చెరువులో పడి మహిళ మృతి

హిందూపురం అర్బన్: రెండు రోజుల క్రితం అదృశ్యమైన మహిళ శుక్రవారం సాయంత్రం కొట్నూరు చెరువులో శవంగా తేలింది. ఎస్‌ఐ హనూర్‌బాషా వివరాలమేరకు.. పట్టణంలోని ఆబాద్‌పేటకు చెందిన లక్ష్మీనారాయణ వ్యాపారి. ఆయన భార్య రెండు రోజుల క్రితం అదృశ్యమైంది. ఆమె కోసం గాలిస్తుండగా కొట్నూరు చెరువులో ఎవరో మహిళ మృతదేహం ఉన్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. మృతురాలు వరలక్ష్మిగా (45) గుర్తించారు. మృతురాలికి ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. వరలక్ష్మి మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

మెగా జాబ్ మేళాకు స్పందన



జాబ్‌మేళాకు హాజరైన నిరుద్యోగులు

- 208 మంది ఉద్యోగాలకు ఎంపిక

పుట్టపర్తి: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సిడాప్ ఆధ్వర్యంలో శుక్రవారం బుక్కపట్నం సత్యసాయి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన మెగా జాబ్ మేళాకు స్పందన లభించింది. జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి అబ్దుల్ ఖయ్యూం మాట్లాడుతూ 11 కంపెనీలు జాబ్ మేళా నిర్వహించగా 500 మంది వివిధ కోర్సులు పూర్తి చేసిన యువతీ యువకులు హాజరయ్యారని పేర్కొన్నారు. అందులో 208 మంది వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం స్థానికంగానే ఉద్యోగాలు కల్పించేందుకు పెద్ద ఎత్తున జాబ్ మేళా కార్యక్రమాలు చేపట్టిందని దీని వలన గ్రామీణ యువతీ యువకులు ఎంతో ఉపయోగకరంగా ఉందన్నారు. బుక్కపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రవికుమార్, గ్రంథాలయ అధ్యాపకులు ఆంజనేయులు, ఎంపీడీఓ శ్రీనివాసులు, ఉన్నత పాఠశాల హెచ్ఎం జగదీశ్వర్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్మీనారాయణ నమోస్తుతే !

- గంధంతో ఆరున్నర అడుగుల లక్ష్మీనారాయణస్వామి విగ్రహం



లక్ష్మీనారాయణస్వామికి పూజలు చేస్తున్న మహిళలు (ఇన్‌సెట్) ప్రత్యేక అలంకరణలో గంధంతో తయారు చేసిన ఆరున్నర అడుగుల లక్ష్మీనారాయణస్వామి ప్రతిమలు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ఆర్యవైశ్య కొత్త సత్రంలో శుక్రవారం అధిక శ్రావణమాసం సందర్భంగా వాసవి మహిళా మండలి ఆధ్వర్యంలో గంధంతో ఆరున్నర అడుగుల లక్ష్మీనారాయణస్వామి విగ్రహాలను తయారు చేయించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. వంద మంది ఆర్యవైశ్య మహిళలు సామూహికంగా దీపలక్ష్మీపూజ, లక్ష్మీనారాయణ పూజ తదితర పూజా కార్యక్రమాలు చేశారు. ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని, సకాలంలో వర్షాలు కురిసి రైతులకు పంటలు బాగా పండాలన్న తలంపుతో మహిళలు స్వామిని పూజించారు. పూజల్లో వాసవీ మహిళా మండలి అధ్యక్షురాలు పోలమడ రూపారాగిని, కార్యదర్శి కాకుమాని కళ్యాణి, కోశాధికారి మంజు సంయుక్త, వాణి, శోభ, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.